సాక్షి
ములుగు
మంగళవారం । 14 । జనవరి । 2025



రామప్పలో పర్యాటకుల సందడి
సంక్రాంతి పండుగకు వరుసగా సెలవులు రావడంతో భక్తులు కుటుంబసమేతంగా రామప్ప ఆలయానికి తరలివచ్చి రామలింగేశ్వరుడిని దర్శించుకున్నారు. - 8లో ▸



మల్లన్నకు మనసారా మొక్కులు
ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా చేరుకుని మొక్కులు చెల్లించారు. - 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం $30^0/18^0$
జిల్లాలో ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వనదేవతలకు మొక్కులు



ఎస్‌ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క–సారలమ్మలను దర్శించుకునేందుకు సోమవారం భక్తులు భారీగా తరలివచ్చారు. జంపన్నవాగు స్నానఘట్టాల వద్ద ఉన్న షెవర్ల కింద పుణ్యస్నానాలు ఆచరించి కల్యాణకట్టలో పుట్టు వెంట్రుకలను సమర్పించుకున్నారు. అమ్మవార్ల గద్దెల వద్ద పసుపు, కుంకుమ, చీరసారె, ఎత్తు బంగారం, కానుకలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భోగి పండుగను పురస్కరించుకుని సమ్మక్క– సారలమ్మ పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు పూజారులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కుల అనంతరం భక్తులు మేడారం పరిసరాల్లో విడిది చేసి వంటావార్పు చేసుకున్నారు.

కొనసాగుతున్న క్రీడాపోటీలు



ములుగు: ములుగు మండల పరిధిలోని చిన్న గుంటూరుపల్లిలో అభ్యుదయ రైతుసంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహిస్తున్న క్రీడాపోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. సోమవారం కబడ్డీ, వాలీబాల్, తాడు గుంజడం, మ్యూజికల్ చైర్ వంటి క్రీడాపోటీలను నిర్వహించారు. క్రీడాకారులకు నిర్వహణ కమిటీ తరఫున తగిన సూచనలు, సలహాలు అందించారు. నేడు మహిళలకు ముగ్గుల పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవిరెడ్డి అంజిరెడ్డి, ముక్కు సుబ్బారెడ్డి, పైడిపల్లి కుమారస్వామి, సానికొమ్ము శ్రీనివాస్ రెడ్డి, నర్సిరెడ్డి, ఆదిరెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయశాఖ పనులు షురూ..



ఎస్‌ఎస్‌తాడ్వాయి: మేడారంలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో మినీ జాతర పనులు మొదలయ్యాయి. ఫిబ్రవరి 12నుంచి 15వ తేదీ వరకు మినీ మేడారం జాతర జరగనుంది. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం మేడారం దేవాదాయశాఖ అధికారులు సోమవారం పనులను ప్రారంభించారు. గద్దెల ప్రాంగణంలో భక్తులు కొబ్బరికాయలు కొట్టే ఐరన్ స్టాండ్‌ల వెల్డింగ్ మరమ్మతుల పనులను చేపట్టారు. మినీ జాతరకు ముందస్తుగా వేలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉండడంతో అధికారులు ఆలయంలో మరమ్మతుల పనులను చేపట్టారు. అమ్మవార్ల గద్దెల చుట్టూ గ్రిల్స్‌ను మరింత ఎత్తు పెంచి హంగిలర్లు ఏర్పాటు చేసేందుకు గతేడాది దేవాదాయశాఖ ఆధ్వర్యంలో రూ.20లక్షలతో టెండర్ నిర్వహించారు. ఈ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌తో మళ్లీ వచ్చే మహాజాతర వరకు హంగిలర్లు ఏర్పాటు చేయనున్నారు. హంగిలర్ల ఏర్పాటుతో భక్తులు గద్దెలపై బెల్లం, కొబ్బరి వేసిరితే దెబ్బలు తలగకుండా ఉంటుంది. ఈ పనులు పొందిన కాంట్రాక్టర్ వెల్డింగ్ మరమ్మతు పనులు ప్రారంభించినట్లు దేవాదాయశాఖ ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

హైకోర్టు జడ్జి పూజలు




కాళేశ్వరం: శ్రీకాళేశ్వర ముక్తీశ్వరుడిని హైకోర్టు జడ్జి రాధరాణి దంపతులు సోమవారం దర్శించుకున్నారు. జడ్జి దంపతులు ఆలయ రాజగోపురం వద్దకు చేరుకోగా ఆలయ అర్చకులు, వేదపండితులు, అధికారులు మంగళవాయిద్యాలు, మంత్రోచ్చరణల నడుమ పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామివారి గర్భగుడిలో ద్విలింగాలకు అభిషేక పూజలు నిర్వహించారు. శ్రీశుభానందదేవి అమ్మవారికి పూజలు చేశారు. ఆశీర్వచన వేదిక వద్ద సూపరింటెండెంట్ శ్రీనివాస్ వారిని శేషవస్త్రాలతో సన్మానించారు. అర్చకులు వారిని ఆశీర్వదించి, తీర్థప్రసాదం అందజేశారు.

కాల గమనం కలల ప్రయాణం

జీవనయానంలో సం'క్రాంతి' వెలుగులు

- చిన్న మార్పులతో పెద్ద విజయం
- పండుగ నేర్పే పాఠాలెన్నో..



పండుగంటే ఆనందాల్ని మూటగట్టుకోవడం.. సంతోషాల్ని నెమరు వేసుకోవడం.. సంప్రదాయాల్ని కాపాడడం.. సంస్కృతిని ముందు తరాలకు అందించడం..

కాలగమనంలో ఒక రాశి నుంచి మరో రాశిలోకి సూర్యుడు మారుతుంటాడు. అలా మారుతున్నదాన్ని సంక్రమణం అంటారు. సంక్రమణమంటే కదలిక అని అర్థం. ఆ మాదిరిగా ప్రతీ మనిషి తన ఆలోచన, నడవడిక, వైఖరిలో సంక్రమించాలి. ఎప్పటికప్పుడు మార్పు చెందాలి. ఆధ్యాత్మికం, ఆరోగ్యం, ఆప్యాయత, అభిరుచి, ఆనందాల కలబోతతో జరుపుకునే సంక్రాంతి నేర్పే పాఠమిదే.

- హన్మకొండ కల్చరల్

వ్యాయామం

ఈ మధ్య ఇన్‌స్టంట్ ముగ్గులూ వచ్చాయి. మహిళలకు శ్రమ లేకుండా మార్కెట్లో దొరికే ఫ్రేమ్‌లపై రంగు పోస్తే చాలు.. ముగ్గు రెడీ అవుతుంది. కానీ.. రోజూ ముగ్గు వేయడం వల్ల శరీరానికి తగిన వ్యాయామం దొరుకుతుంది. సృజనాత్మక శక్తి పెరుగుతుంది. వంగి ముగ్గులు వేయడం వల్ల శరీరంలోని కొవ్వు కరుగుతుంది. వంగి లేవడం వల్ల శ్వాస తీసుకోవడం, వదలడం ఎక్కువ సార్లు చేస్తారు. దీంతో ప్రాణాయామం చేసినట్లు అవుతుంది.

ఆధ్యాత్మికం..



కాస్తంత పని చేస్తేనే అలసిపోతారు. విశ్రాంతి తీసుకుంటారు. మరి నిత్యం లక్షల ఆలోచనలు చేసే మనసుకెక్కడుంది విశ్రాంతి. మనసు ఆహ్లాదంగా మారాలంటే.. ఆధ్యాత్మికతతో నిండాలని ఆధ్యాత్మికవేత్తలు చెబుతున్నారు. కుటుంబంతో కలిసి దేవాలయాలను సందర్శించడం, ఆధ్యాత్మిక గ్రంథాలు చదవడం వల్ల ఆధ్యాత్మికత అలవడుతుంది. ఆలయాల్ని సందర్శించడం ద్వారా మనసుకు కావాల్సిన కాస్మిక్ ఎనర్జీ అందుతుంది. దేవాలయాల్లో వినిపించే ప్రవచనాలు, మంత్రాలు, సంగీతం మనసును తేలికపరుస్తాయి.

ఆరోగ్యం..



షడ్రుచులతో భోజనం చేస్తే పొట్టకు పండగే. అలాగని బయట దొరికే ఆహార పదార్థాలు తీసుకోవద్దు. మార్కెట్లో కల్తీ పెరిగిన నేపథ్యంలో ఇంటి వంటలకు పరిమితమైతేనే మంచిది. ఇంట్లో చేసే పిండి వంటల్లో ఆరోగ్య సూత్రాలు ఎన్నో దాగున్నాయి. నువ్వులతో చేసిన పిండి వంటలు తినడం వల్ల శరీరంలో వేడి పెరుగుతుంది. అరిసెలు అనారోగ్యాన్ని దూరం చేస్తాయని పెద్దలు చెబుతుంటారు. ఇలా ప్రతీ వంటకం ఆరోగ్యాన్ని కలుగజేసేదే.

అనుబంధం



ఉపాధి కోసం ఊరు విడిచి వెళ్లిన వారంతా పండుగ నేపథ్యంలో ఇళ్లకు చేరుతుంటారు. ఈసమయంలో అందరూ కలిసి కష్టసుఖాలు పంచుకుంటే పండుగ కలకాలం గుర్తుండిపోతుంది. అందరూ ఒక చోట చేరిన సమయంలో ఫోన్లను దూరం పెడితే మంచిది. ఉమ్మడిగా భోజనాలు చేయడం.. సామూహికంగా పూజలు చేయడం వల్ల ఆప్యాయతలు పెరుగుతాయి. అంత్యాక్షరి, చిన్న చిన్న ఆటలు ఆడుకోవడం వల్ల మళ్లీ పండుగ ఎప్పుడొస్తుందా? అని ఎదురు చూస్తారు.

మమేకం..



ఈ సృష్టిలో ప్రతీ జీవిలో కదలిక ఉంటుంది. దాన్ని సైంటిస్టులు తరంగాలు అన్నారు. ఎక్కడో ఉన్న వ్యక్తి వీడియో కాల్‌లో ఇక్కడ కనిపించడమేంటి? అదే మాదిరిగా.. ప్రతీ జీవీ మనిషికి ఏదో సమయంలో ఏదో విధంగా సాయపడుతూనే ఉంటుంది. మనుషులు ఆహారాన్ని సంపాదించడానికి పరుగులు పెడతారు. రేపటి కోసం దాచుకుంటారు. మూగజీవాలు, పశుపక్ష్యాదులు మాత్రం అలా కాదు.. ఏరోజుకారోజు ఆహారాన్ని తెచ్చుకుంటాయి. వాటికి మనుషులతో విడదీయలేని బంధం. వాటిపై కృతజ్ఞత చూపాలి. వ్యవసాయంలో ఇతోదికంగా సహాయపడే పశువులను సంక్రాంతి పండుగలో భాగంగా కనుమ రోజు పూజించడం ఆనవాయితీ అందుకే.

ఆంధ్రా బాట

- బతుకమ్మకు ఇక్కడ.. సంక్రాంతికి అక్కడ
- కోడి పందేలకోసం యువత ప్రయాణం
- ఉమ్మడి వరంగల్ నుంచి వేలాదిగా..
- ఈసారి ఏపీ పందేలకు వరంగల్ కోళ్లు

మహబూబాబాద్, సాక్షి: ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు, వ్యాపారంలో కలిసి పనిచేయడం, హైదరాబాద్ వంటి నగరాల్లో కలిసి మెలిసి ఉండడం పరిపాటి. అయితే రెండు రాష్ట్రాలు విడిపోయిన తర్వాత ఇరు ప్రాంతాల మధ్య సంబంధాలు, బంధుత్వాలు మరింత బలపడుతున్నాయి. ఏపీలోని బంధువులను బతుకమ్మ పండుగకు తెలంగాణకు ఆహ్వానించడం.. తెలంగాణలోని బంధువులను ఏపీకి ఆహ్వానిస్తున్నారు. దీంతో విద్యాసంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలకు సెలవులు ప్రకటించిన వెంటనే జిల్లా నుంచి ఏపీకి బంధువులు, స్నేహితుల ఇళ్లకు పయనమవుతున్నారు. ప్రధానంగా ఉమ్మడి జిల్లాలోని తాడ్వాయి, మంగపేట, నర్సంపేట, వెంకటాపురం, ములుగు, వరంగల్, హనుమకొండ, పర్వతగిరి, జనగామ, తొర్రూరు, మహబూబాబాద్, డోర్నకల్, కురవి, మరిపెడ, కేసముద్రం, గూడూరు, గార్ల, బయ్యారం ప్రాంతాల నుంచి ఏపీకి వెళ్లేవారి సంఖ్య అధికంగా ఉంటోంది.

బరిగీసి.. పందెమాడేందుకు..

మూడు రోజుల పాటు జరిగే సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఏపీలో నిర్వహించే కోడి పందేలు, ఇతర వేడుకల్లో పాల్గొనడం, ఆయా కార్యక్రమాలను తిలకించేందుకు యువతతోపాటు, వ్యాపారులు, రాజకీయ ప్రముఖులు ఏపీకి వెళ్తున్నారు. ఇందులో తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలకు వెళ్తున్న వారే ఎక్కువగా ఉంటున్నారు. ప్రధానంగా తెలంగాణ సరిహద్దులోని జంగారెడ్డిగూడెం, పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేటతో పాటు భీమవరం, ఏలూరు, పాలకొల్లు, నూజివీడు ప్రాంతాలకు ఇప్పటికే పలువురు చేరారు. అక్కడ కోడి పందేలు రూ.5వేల నుంచి రూ.5లక్షల వరకు చేరుతున్నాయి. రాజుల పందేలు అయితే బరికి రూ.10లక్షల వరకు వెళ్తోంది. అయితే ఈ ఏడాది ఆంధ్రాలోని కోడి పందేలకు తెలంగాణ నుంచి కూడా పందెం కోళ్లను తీసుకెళ్లడం కొసమెరుపు.

సంక్రాంతి వస్తే ఆంధ్రాలోనే..



చిన్నప్పటి నుంచి సంక్రాంతి పండుగ వస్తే చాలు మా ఇళ్లంతా సందడే. వారం రోజుల నుంచి ఏపీకి వెళ్లేందుకు సిద్ధం అవుతాం. మా అక్క, బావలు రాజమండ్రిలో ఉంటారు. అక్కడ గోదావరి ఒడ్డున పండుగ జరుపుకుంటే ఆ సంతోషమే వేరు. మా అక్కా, బావలను బతుకమ్మ పండగకు మా ఇంటికి పిలుస్తా.. వారు ఇక్కడికి వచ్చి ఎంజాయ్ చేస్తారు.

- రేసు స్పందన, మహబూబాబాద్

పదేళ్ల నుంచి వెళ్తున్నా..



సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గడిచిన పదేళ్లుగా భీమవరం వెళ్తున్నం. ఇంటి వద్ద భోగి పండుగ చేసుకుని.. మిత్ర బృందంతో కలిసి సంక్రాంతి పండుగ రోజు భీమవరంలో ఉండేలా ప్లాన్ చేసుకుంటాం. గోదావరి నదిలో పుణ్యస్నానం ఆచరించి.. కోడిపందెల్లో పాల్గొంటాం. అక్కడ జరిగే సంక్రాంతి సంబురాలు చూస్తాం.

- మల్లిగారి రాజు, జనగామ, అంబేద్కర్‌నగర్

ఏటూరునాగారంలో భోగి మంటలు వేసి సంబురాలు జరుపుకుంటున్న ప్రజలు



ఘనంగా భోగి

నేడు సంక్రాంతి, రేపు కనుమ

ములుగు/ఏటూరునాగారం: జిల్లా వ్యాప్తంగా సోమవారం భోగి పండుగ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు తమ ఇళ్ల ఎదుట రంగురంగుల ముగ్గులు వేసి నవధాన్యాలతో గొబ్బెమ్మలు పెట్టారు. చిన్నారులకు భోగిపండ్లు పోసి పండుగను సంతోషంగా జరుపుకున్నారు. అలాగే పలువురి ఇళ్లలో బొమ్మల కొలువులు నిర్వహించారు. మహిళలు పిండి వంటలను తయారు చేసి వారి ఇష్టదైవాలకు సమర్పించారు. దీంతో పాటు స్థానికంగా ఉన్న దేవాలయాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల సందడి నెలకొంది.

భోగి మంటల సందడి..

అందరికీ మంచి జరగాలని కోరుకుంటూ ప్రజలు తమ ఇళ్లలోని పాత కర్రలు, ఇతర సామగ్రిని ఇంటి పరిసరాల్లో ఒక చోట పేర్చి భోగి మంటలు కాగి సందడిగా గడిపారు. ఏటూరునాగారంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో భోగి మంటలు వేసి చుట్టూ నృత్యాలు చేస్తూ సంబురాలు నిర్వహించారు. పీఆర్ఆర్ యూనిటీ అండ్ చారిటీ ట్రస్ట్ నిర్వాహకులు మడుగూరి నాగేశ్వరరావు అధ్యక్షతన ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. నేడు సంక్రాంతిని ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు.



మంగపేటలో చిన్నారులకు భోగిపండ్లు పోస్తూ..



లక్ష్మీపురంలో ముగ్గు వేస్తున్న మహిళ

కనులపండువగా..

గోదారంగనాథుల కల్యాణం

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం గోదాదేవి రంగనాదుల కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఎల్లాప్రగడ నాగేశ్వరరావు శర్మ, వేద పండితులు మణికంఠ శర్మ, కృత్తిక శర్మ కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. ధనుర్మాసంలో గోదారంగనాథుల కల్యాణం జరిపించడం శుభప్రదమైందని వెల్లడించారు. అష్టోత్రనామ పూజలు, తిరుప్పావై మంత్ర ప్రశస్తను జరిపించారు. మాంగళ్యధారణ ముహూర్తానికి గోదారంగనాథుల కల్యాణం జరిపించారు. దేవతామూర్తులకు తలంబ్రాలను పోసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు కల్యాణ వేడుకలను తిలకించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి శేషవస్త్రాలను లక్ష్మీనర్సింహారావుకు, ప్రదీప్‌రావుకు అర్చకులు నాగేశ్వరరావుశర్మ బహూకరించారు. ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాకులమర్రి భాస్కర్‌రావు, మేర్గు వెంకటేశ్వర్లు, అల్లి శ్రీనివాస్, ఆలయ చైర్మన్ అలువాల శ్రీనివాస్, తాటి కృష్ణ, తాదూరి రఘు, కోశాధికారి దీనబాంధువస్వామి, ప్రధాన కార్యదర్శి కత్తెర శ్రీనివాస్, బాల్యప్రసాద్, పెండ్యాల సంతోష్‌తో పాటు కమిటీ సభ్యులు సిద్దు, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.



తలంబ్రాలను పోస్తున్న కమిటీ సభ్యులు



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న లక్ష్మీనర్సింహారావు తదితరులు

భూముల సర్వే..

రేపు ప్రజాప్రతినిధులు, రైతులతో అధికారుల సమావేశాలు

- జిల్లాలో 16నుంచి 20వ తేదీ వరకు సర్వే కొనసాగింపు
- 21నుంచి 25వ తేదీ వరకు గ్రామసభలు
- సాగు భూములకు మాత్రమే అందనున్న రైతుభరోసా

ఏటూరునాగారం: అర్హులైన రైతులకు మాత్రమే రైతుభరోసా చెల్లించడానికి ప్రభుత్వం ప్రణాళిక చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా అధికారులు ఎంత మంది రైతుల భూములు సాగులో ఉన్నాయి, అసైన్డ్ భూముల వివరాలు, సాగులో లేని భూముల వివరాలను సర్వే చేపట్టి పరిశీలించనున్నారు. ఈ సర్వేతో భూముల బాగోతం బయటపడనుంది. అయితే గత ప్రభుత్వం చేసిన తప్పులను ఈ ప్రభుత్వం చేయకుండా అర్హులైన రైతులకు మాత్రమే రైతుభరోసా వర్తింపజేయాలనే సంకల్పంతో ముందుకెళ్తోంది. అర్హులైన రైతులకు మాత్రమే గుర్తించి రైతుభరోసా కింద రూ.12వేలు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త ప్రణాళికలతో ముందుకెళ్తోంది.

రేపు గ్రామాల వారీగా సమావేశాలు

రేపు వ్యవసాయశాఖ అధికారులు మండలంలోని మాజీ ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులతో సమావేశాలను నిర్వహించనున్నారు. 16వ తేదీ నుంచి గ్రామాల వారీగా రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు పంట భూముల సర్వే చేపట్టి ఏ భూమిలో ఏముందని నమోదు చేసుకుంటారు. ఇలా 20వ తేదీ వరకు సర్వేలు చేపట్టి 21నుంచి 25వ తేదీ వరకు గ్రామ పంచాయతీల్లో గ్రామసభలను నిర్వహణ ఉంటుంది. ఈ సభల్లో సర్వే చేసిన ఆధారంగా పంట భూముల స్థితిగతులను తెలిపి రైతుభరోసా జాబితాలో నుంచి రైతుల భూముల పేర్లను తొలగించనున్నారు.

భూముల ప్రక్షాళన

సాగులో లేని భూములకు కూడా రైతుబంధు తీసుకుంటున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించింది. దీంతో రైతుకు చెందిన నాలా కన్వెన్షన్, ల్యాండ్ అక్విజేషన్, ఇసుక మేటలు, మైనింగ్‌కు అప్పగించినవి, గృహ నిర్మాణాలు, సాగులో లేని భూములను గుర్తించి వాటిని రైతుభరోసా పథకం నుంచి అనర్హులైన రైతుల పేర్లను తొలగిస్తారు. దీంతో ప్రజాధనం దుర్వినియోగం కాకుండా అడ్డుకట్టే వేసే అవకాశం ఉంది. రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు జాయింట్ సర్వేలు చేపట్టడం వల్ల అనేక భూముల బాగోతం బయటపడనుంది.



మండలాల వారీగా సాగుభూముల వివరాలు

ఏటూరునాగారం	7,167
గోవిందరావుపేట	6,456
కన్నాయిగూడెం	5,100
మంగపేట	9,870
ఎస్‌ఎస్‌తాడ్వాయి	7,693
వెంకటాపురం(కె)	8,372
వాజేడు	9,260
ములుగు	18,421
వెంకటాపురం(ఎం)	11,109

16 నుంచి సర్వే..



ఈ నెల 16వ తేదీ నుంచి గ్రామాల వారీగా సర్వేను చేపట్టనున్నారు. ఏ భూమి స్థితిగతులు ఏంటని నమోదు చేసుకుంటారు. రైతు భరోసాకు ఇచ్చిన నిబంధనలకు లోబడి ఈ సర్వే చేయాల్సి ఉంది. అక్రమంగా రైతుబంధు పొందిన భూముల పేర్లను తొలగిస్తాం. సర్వేను మరింతగా పారదర్శకంగా చేపట్టేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

- సురేశ్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

నేడు హేమాచలుడి వరపూజ

- వివాహ నిశ్చయ తాంబూలాల స్వీకరణ
- వేలాదిగా తరలిరానున్న భక్తులు

మంగపేట: మండల పరిధిలోని మల్లూరులో నేడు మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీహేమాచల లక్ష్మీనర్సింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు వరపూజ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు దేవాదాయ ధర్మాదాయశాఖ హేమాచల క్షేత్రం ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రావణం సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతిఏటా పుష్యమాసంలో ఉత్తరాయణ పుణ్యకాలంలో సూర్యుడు ధనస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించడాన్ని మకర సంక్రమణం అంటారని ప్రధానార్చకులు కైంకర్యం రాఘవాచార్యులు తెలిపారు. నేడు(మంగళవారం) మకర సంక్రాంతి పండుగను పురస్కరించుకుని హేమాచలక్షేత్రంలోని స్వయంభు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం లక్ష్మీనర్సింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో అలంకరిస్తారు. అనంతరం ప్రత్యేక పల్లకి(సేవ)పై మంగళవాయిద్యాల నడుమ మల్లూరు గ్రామానికి తీసుకుని వచ్చి వరపూజా మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. మే నెలలో హేమాచలక్షేత్రంలో 10రోజుల పాటు నిర్వహించనున్న స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా లక్ష్మీనర్సింహస్వామి తిరుకల్యాణ మహోత్సవ సుమూహూర్త నిశ్చయ తాంబూలాల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా నేడు రాత్రి 7 నుంచి 10.20 గంటల వరకు స్వామివారు, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు వేద బ్రాహ్మణులు ప్రవరా వరపూజా మహోత్సవం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించనున్నారు. మే 12వ తేదీన స్వామివారి తిరుకల్యాణ మహోత్సవ సుముహూర్తం ఖరారు, నిశ్చయ తాంబూళాల స్వీకరణ కార్యక్రమాన్ని చేయనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి సత్యనారాయణ తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలిరా నుండడంతో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఆదివాసీల చీరసారె..

లక్ష్మీనర్సింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్ల వరపూజను పురస్కరించుకుని ఆదివాసీ గిరిజనులు ఆడబిడ్డగా ఆరాధించే చెంచులక్ష్మి అమ్మవారికి చీర, జాకెట్, గాజులు, పసుపు కుంకుమతో పాటు స్వామివారికి రాసగుమ్మడి కాయలను సారెగా సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. మండల పరిధిలోని చుంచుపల్లి గ్రామాన్ని పూర్వం చెంచుపల్లిగా పిలిచేవారు. ఆదివాసీ గిరిజన తెగకు చెందిన చెంచు నాయకుడు ఈ ప్రాంతాన్ని పరిపాలించే క్రమంలో ఈ ప్రాంతానికి వేటకోసం వచ్చిన లక్ష్మీనర్సింహస్వామి చెంచునాయకుడి కుమార్తెను గాంధర్వ వివాహం చేసుకున్నాడని ఈ ప్రాంత ప్రజలు కథలు కథలుగా చెప్పుకుంటారు. అప్పటి నుంచి ప్రతిఏటా సంక్రాంతి పండుగ రోజు నిర్వహించే స్వామివారి వరపూజా కార్యక్రమానికి ఆదివాసీ గిరిజనులు తరలివచ్చి చీరసారె, రాసగుమ్మడి సమర్పించి కానుకలు సమర్పిస్తుంటారు.



లక్ష్మీనర్సింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్ల ఉత్సవ మూర్తులు(ఫైల్)

సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు

రామప్పలో పర్యాటకుల సందడి


రామలింగేశ్వరస్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు


జపాన్ దేశస్తులకు ఆలయ విశిష్టతను వివరిస్తున్న గైడ్

వెంకటాపురం(ఎం): ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన రామప్ప దేవాలయానికి సోమవారం పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సంక్రాంతి పండుగకు వరుసగా సెలవులు రావడంతో కుటుంబసమేతంగా ఆలయానికి వచ్చి రామలింగేశ్వరుడిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్, రాజ్‌కుమార్ తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. కాగా, పర్యాటకులు అధిక సంఖ్యలో రావడంతో అర్చన టికెట్ తీసుకున్న వారినే గర్భగుడిలోకి అనుమతించగా, మిగతా వారు సాధారణ దర్శనం చేసుకుని వెళ్లిపోయారు. ఆలయ విశిష్టత గురించి గైడ్‌లు విజయ్‌కుమార్, వెంకటేశ్ వివరించారు. అనంతరం బోటింగ్ చేస్తూ సరస్సు అందాలు తిలకించారు.

రామప్ప.. బ్యూటిఫుల్ టెంపుల్

రామప్ప.. బ్యూటిఫుల్ టెంపుల్ అంటూ జపాన్‌కు చెందిన మరియా, టూకీ, మేఘాలయకు చెందిన పర్యాటకులు కొనియాడారు. సోమవారం దేవాలయాన్ని వేర్వేరుగా సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ విశిష్టత గురించి గైడ్ వివరించగా శిల్పకళా సంపద బాగుందన్నారు. ఇలాంటి శిల్పకళాసంపద మరెక్కడ చూడలేదన్నారు. రామప్ప అందాలను తమ సెల్‌ఫోన్‌లో బంధించుకున్నారు.

మల్లన్నకు మనసారా మొక్కులు..

వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- ఐలోనిలో ఘనంగా భోగి ఉత్సవాలు


స్వామివారికి వరం పడుతున్న భక్తులు

ఐనవోలు: తెలంగాణ రాష్ట్రంలో ప్రముఖ శైవక్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం భోగి పర్వదినాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఉప ప్రధాన అర్చకులు పాతర్లపాటి రవీందర్, శ్రీనివాస్, మధుకర్ శర్మ, వేద పారాయణ దారు గట్టు పురుషోత్తమశర్మ, విక్రాంత్ వినాయక్ జోషి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తన్మయత్వం పొందారు. తమ ఆచారం ప్రకారం మనసారా మొక్కులు చెల్లించారు. కుటుంబ సమేతంగా ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి గర్భాలయంలో కొలువైన గొల్లకేతమ్మ, బలిజమేడలమ్మసమేత శ్రీమల్లికార్జునుడిని, అర్ధప్రాణ వట్టం కలిగిన శ్వేతవర్ణంలోని నిరాకార నిరంజనుడిని దర్శించుకున్నారు.

మల్లన్నను దర్శించుకున్న ప్రముఖులు..

ఐనవోలు జాతర ఉత్సవాల్లో భాగంగా భోగి పర్వదినం సందర్భంగా వర్ధన్నపేట, భూపాలపల్లి ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, జీడబ్ల్యూఎంసీ మేయర్ గుండు సుధారాణి–రాజశేఖరం దంపతులు, డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ–వరద రాజేశ్వర్‌రావు దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. ప్రముఖులందరికీ ఆలయ మర్యాదలతో ఈఓ అద్దంకి నాగేశ్వర రావు, అర్చకులు స్వాగతం పలికారు.

పెద్ద పట్నాలు వేసుకుంటున్న భక్తులు..

మల్లన్న ఆలయంలో భక్తులే పెద్ద పట్నాలు వేసుకునే సంస్కృతి పెరుగుతోంది. గతంలో ఆలయం వద్ద టికెట్లు కొనుగోలు చేసిన భక్తులకు ఒగ్గు పూజారులు పట్నాలు వేసేవారు. అయితే ఇటీవల పదుల సంఖ్యలో భక్తులందరూ 11 పలకల పెద్ద పట్నాలు వేస్తున్నారు.

నేడు మకర సంక్రాంతి ప్రత్యేక పూజలు

మకర సంక్రాంతి సందర్భంగా మంగళవారం ఆలయ గర్భగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, మహానివేదన, మంత్ర పుష్పం ఇత్యాది కార్యక్రమాలతో పాటు రాత్రి స్వామివారి రథోత్సవం, ప్రభ బండ్లు తిరగడం లాంటి కార్యక్రమాలు ఉంటాయి.

నేడు సెపక్‌తక్రా ఫైనల్స్

వరంగల్ స్పోర్ట్స్: తెలంగాణ సెపక్‌తక్రా అసోసియేషన్ ఆధ్వర్యాన హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహిస్తున్న 34వ సీనియర్ నేషనల్స్ సెపక్‌తక్రా మెన్ అండ్ ఉమెన్ చాంపియన్‌షిప్ పోటీలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఇప్పటికే డబుల్స్, టీం ఈవెంట్లలో ఫైనల్స్ పూర్తి చేసుకోగా.. సోమవారం రేగో ఈవెంట్‌లో సెమీ ఫైనల్స్ పూర్తయ్యాయి. క్వాడ్‌లో లీగ్ మ్యాచ్‌లు మంగళవారం సాయంత్రం వరకు ముగియనున్నట్లు సెపక్‌తక్రా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రిక్కల శ్రీనివాసరెడ్డి తెలిపారు.

కొత్తకొండకు భక్తజనం..

- కోరమీసాల స్వామి వారికి వీరబోనం సమర్పణ
- భోగి వేడుకలతో మొదలైన జాతర


బోనంతోపాటు గుమ్మడికాయ ఎత్తుకుని స్వామి వారి వద్దకు వెళ్తున్న భక్తులు


జాతరలో నృత్యం చేస్తున్న భక్తులు

ఎల్కతుర్తి: హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయ జాతర సోమవారం భోగి వేడుకలతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి గుమ్మడికాయ, నారికేళం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ముందు గండదీపం వద్ద నూనె పోసి అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కోడె మొక్కులు చెల్లించుకున్నారు. దామెర్ప్పులకు చెందిన కుమ్మరి వంశీయులు ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండ్ల రథాల ద్వారా ఆలయానికి చేరుకుని స్వామి వారికి కొబ్బరి, గుమ్మడికాయలతో పాటు వీరబోనం సమర్పించారు. అలాగే, కొందరు వాహనాలపై ప్రభలతో ఆలయానికి చేరుకున్నారు. వీరభద్రుడి సన్నిధిలో గండదీపం వెలిగించారు. కాగా, ఆలయంలో భోగి వైభవోపేతంగా జరిగింది. శివసత్తులు, కుమ్మరుల నృత్యాల నడుమ జాతర వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తజనం భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. కాగా, సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా జాతరలో బందోబస్తు పరిశీలించారు. ఆమెతో కాజీపేట ఏసీపీ తిరుమల్, సీఐలు పులి రమేశ్, పుల్యాల కిషన్, ప్రవీణ్‌కుమార్, ఆలయ ఈఓ కిషన్ రావు, చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా ఉన్నారు.

రైలు కింద పడి ఒకరి ఆత్మహత్య

నెక్కొండ: రైలు కింద పడి ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన సోమవారం నెక్కొండ రైల్వే స్టేషన్ పరిధిలో జరిగింది. వరంగల్ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సుదర్శన్ కథనం ప్రకారం.. సుమారు 45 నుంచి 50 సంవత్సరాల వయస్సు గల ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని డౌన్ మెయిల్ లైన్, డౌన్ లోడ్ లైన్ల మధ్య గుర్తించారు. మృతుడు బ్లూ కలర్ లోయర్, బ్లూ కలర్ గీతల షర్ట్, కాకి కలర్ స్వెటర్ ధరించి ఉన్నాడు. ఘటనా స్థలిలో మృతుడి ఆచూకీ సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీలో భద్రపరిచామని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

పోలీసుల అదుపులో మద్యం ప్రియులు


కౌన్సెలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ రవికుమార్

హసన్‌పర్తి : బహిరంగంగా మద్యం తాగుతున్న తొమ్మిది మందిని సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని యాదవనగర్ ప్రాంతంలో కొంతమంది మద్యం తాగుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి వెళ్లి మద్యం తాగుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ ఇచ్చి, కేసు నమోదు చేసినట్లు కేయూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

యువకుడి హత్య కేసులో నిందితుల అరెస్ట్

- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ పండరీ చేతన్ నితిన్


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ చేతన్ నితిన్

జనగామ రూరల్: పట్టణంలోని వినాయక బార్ వెనుక ఓ యువకుడిని హత్య చేసిన నిందితులను అరెస్ట్ చేసినట్లు ఏఎస్పీ పండరీ చేతన్ నితిన్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జనగామలోని ధర్మకంచకు చెందిన గాండ్ల సంపత్, మహమ్మద్ హైదర్, వెంకన్న కుంటకు చెందిన మార్చ లక్ష్మణ్ స్నేహితులు. ఈ క్రమంలో సుమారు 6 నెలల క్రితం జనగామ రైల్వే స్టేషన్‌లో కూలి పని చేసుకుంటూ జీవిస్తున్న మహబూబాబాద్‌కు చెందిన బానోత్ వెంకన్న(34), సంపత్ మధ్య గొడవ జరిగింది. ఆ ఘర్షణను మనసులో పెట్టుకున్న నిందితులు శనివారం రాత్రి వినాయకబార్‌కు వచ్చిన వెంకన్నకు మద్యం తాగించారు. అనంతరం తమతోపాటు తీసుకెళ్లి బండ రాయితో మోదారు. మెడ, తలపై బీర బాటిళ్లతో పొడిచి హత్య చేశారు. అనంతరం మృతదేహం గుర్తు పట్టకుండా పెట్రోల్ పోసి పాక్షికంగా కాల్చివేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. వినాయక బార్‌లో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. దీంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు. కాగా, హత్య కేసును 24 గంటల్లోనే ఛేదించి నిందితులను పట్టుకోవడంలో ప్రతిభకనబరిచిన నర్మెట సీఐ అబ్బయ్య, ఎస్సై చెన్న కేశవులు, కానిస్టేబుళ్లు అరవింద్, మహేందర్, రామకృష్ణ, ప్రవీణ్, రాజేశ్, జితేందర్‌ను ఏసీపీ అభినందించారు.

బైక్ చోరీలకు పాల్పడుతున్న యువకుడు..

- ఆరు బైక్‌లు, ఆటో స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీసీపీ రాజమహేంద్రనాయక్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న డీసీపీ, ఏసీపీ

స్టేషన్‌ఘన్‌పూర్: వరుస బైక్ చోరీలకు పాల్పడుతున్న యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ రాజమహేంద్రనాయక్ తెలిపారు. ఈమేరకు సోమవారం ఘన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం రామవరం గ్రామానికి చెందిన ఉడుత హరీశ్ బైక్ మెకానిక్‌గా పనిచేసేవాడు. కొంతకాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పాల్గొంటున్నాడు. డబ్బుల కోసం వరుస బైక్ చోరీలకు పాల్పడుతున్నాడు. 2020లో ములుగు, స్టేషన్‌ఘన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో నాలుగు కేసుల్లో కొన్ని నెలలు జైలుకు వెళ్లి విడుదలయ్యాడు. అయినా అతడి ప్రవర్తన మారలేదు. 2024లో ఆత్మకూరు మండలం హౌస్‌బుజుర్గు, పాలకుర్తి మండలం పెద్దతండా, స్టేషన్‌ఘన్‌పూర్ మండలం శివునిపల్లి, ఇటీవల లింగాలఘణపురం మండలం చీటూరు, స్టేషన్‌ఘన్‌పూర్ పట్టణం, ఘన్‌పూర్ మండలం తానేదార్‌పల్లిలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం ఆరు బైక్‌లు, ఒక ఆటోను అపహరించాడు. ఈ క్రమంలో ఇటీవల ఘన్‌పూర్‌లో వరుసగా బైక్ చోరీలు జరుగుతున్న నేపథ్యంలో ఘన్‌పూర్ సీఐ, ఎస్సై, సిబ్బంది సోమవారం రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో హరీశ్ తాను అపహరించిన ఆటోతో అనుమానాస్పదంగా వెళ్తుండగా తనిఖీ చేసి సంబంధిత పత్రాలు లేవని గుర్తించారు. అదుపులోకి తీసుకుని విచారించగా బైక్‌ల చోరీలు చేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. దీంతో ఆటోతో పాటు చోరీ చేసిన అతడి స్వగ్రామం రామవరంలో ఉన్న ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ తెలిపారు. కాగా, ఆటో, ఆరు బైక్‌లు విలువ రూ.5.09 లక్షలు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏసీపీ భీమ్ శర్మ, సీఐ జి.వేణు, ఎస్సై రమేశ్, కానిస్టేబుళ్లు గౌస్, కుమార్, ఏకాంబ్రం తదితరులు పాల్గొన్నారు.

పశు సోయగం

నర్సంపేటలో పశుసంపద అందాల పోటీలు


పోటీకి సై అంటున్న మేక పోతులు





అందాల పోటీలకు వచ్చిన ఆవుదూడలు, పాడి గేదెలు, కోళ్లు, శునకం

సంక్రాంతి పర్వదినం సందర్భంగా సోమవారం శాంతిసేన రైతు సంఘం ఆధ్వర్యంలో నర్సంపేట పట్టణంలోని బాలుర హైస్కూల్‌లో పశు సంపద అందాల పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా పలు రకాల పశువులు పోటీల్లో తమ సోయగాన్ని ప్రదర్శించాయి. జోడెడ్లు, ఆవులు, గేదెలు, గొర్రె, మేకపోతులు, శునకాలు, దూడలు, కోడి పుంజులను పలు గ్రామాల రైతులు అలంకరించి పోటీలకు తీసుకువచ్చారు. న్యాయ నిర్ణేతలు విజేతలను ప్రకటించారు. - నర్సంపేట


గొర్రె పొట్టేలుతో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

CHANGE OF NAME

- I, BEERAVELLI RAMA REDDY (Old Name), R/o. H.No. 4-118, Nainpaka (V), Chityal (M), Jayashankar Bhupalpally District-506356, Telangana State, India Declare that I changed my name from Beeravelli Rama Reddy (Old Name) to Beeravolu Ram Reddy (New name) [W-1264189]

BUSINESS OFFER

- కంపెనీ అన్ని రకాల వ్యాపార, ప్రాజెక్ట్‌ల, వ్యక్తిగత, వ్యవసాయ, విద్య రుణాల సలహాలకు సంప్రదించండి. DMA స్వాగతం. జీతం+కమీషన్. ✆ 9671637906. [T-299]

WANTED

- ప్రముఖ భద్రకాళి ఫర్నీచర్, శివనగర్ నందు పని చేయుటకు యువతీ యువకులు వెంటనే కావలెను. రూం సౌకర్యం కలదు. సంప్ర: 9246992479. [WA-14758]

- Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 20,000 నుండి 25,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1256039]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.